సీడీపీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 20 : సీడీపీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు సక్రమంగా అన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీపీడీవోలు ఫీల్డ్ విజిట్ చేసి పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి అవసరమైన పక్షంలో న్యూట్రిషియన్ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బాలామృతం, మురుకులు, పాలు, గుడ్డు తదితర పౌష్టికాహారం అందించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. బయో మెట్రిక్ హాజరు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఈఈలు దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, డిప్యూటీ ఈఈలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

యువత భవిష్యత్తును తీర్చిదిద్దేది గ్రంథాలయాలే

వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్న విజేతలు

కామారెడ్డి, నవంబర్ 20 : యువత భవిష్యత్తును తీర్చిదిద్దేది గ్రంథాలయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ యువతను కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, ఉద్యోగాలు సాధించిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వనిత, కౌన్సిలర్ అనూష, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల కోసం రేపు జాబ్ మేళా

కామారెడ్డి, నవంబర్ 20 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు రూం నంబర్ 121 లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని స్టాఫింగ్ టైటాన్స్ ప్రైవేట్ లిబిటెడ్ అండ్ కేఎల్ గ్రూప్‌లో పలు పోస్టులకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంటర్, బీటెక్, ఎంబీఏ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. వయస్సు 18 నుంచి 30 ఏండ్ల యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6303932430, 7730820444 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమాచారం ఇవ్వలేదని పోలీసులకు ఫిర్యాదు

ఆలయ ఈవోపై ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

భిక్కనూరు, నవంబర్ 20 : ఆలయాభివృద్ధిపై పలు వివరాలు ఇవ్వాలంటూ గత జూన్ 26వ తేదీన సమచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్టీఐ జిల్లా ప్రతినిధి రవీందర్ తెలిపారు. దీనికి బదులుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి సహచట్టం ద్వారా ఎలాంటి సమాచారం ఇవ్వడం కుదరదంటూ సిద్ధిరామేశ్వర స్వామి ఆలయ ఈవో శ్రీధర్ లిఖిత పూర్వకంగా ఇచ్చాడన్నారు. ప్రభుత్వ పరిధిలోని ఏ కార్యాలయం నుంచైనా సమాచారం కోరవచ్చని, పూర్తి సమాచారం ఇవ్వని అధికారి శ్రీధర్‌పై బుధవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్ ఎస్సై సాయికుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు రవీందర్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదం అంచుల్లో వాహనదారులు

కొయ్యగుట్ట వద్ద తవ్విన డ్రైనేజీ గుంత దగ్గర ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయని దృశ్యం

బాన్సువాడ రూరల్, నవంబర్ 20 : జాతీయ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న పనుల వద్ద కాంట్రాక్టర్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారు. మండలంలోని కొయ్యగుట్ట వద్ద ప్రమాదకర మూల మలుపు ఉంది. ఈ మలుపు వద్ద డ్రైనేజీ కోసం తవ్విన గుంత వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. రోడ్డు కోసం తవ్విన గుంతలో పడి ఇప్పటికే చాలా మంది వాహనదారులు గాయాలపాలయ్యారు. రాత్రి సమయంలోనే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు విస్తరణ పనుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాపాలనపై అవగాహన

మాచారెడ్డి, నవంబర్ 20 : మాచారెడ్డితోపాటు గజ్యానాయక్‌తండా, ఎక్స్ రోడ్, ఎల్లంపేట గ్రామాల్లో ప్రజాపాలనపై కళాకారులు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీబాబు, కళాకారులు ఐండ్ల రాము, ఆకునూరి దేవయ్య, రమేశ్‌రావు, దివ్యశ్రీ, శిల్ప, లక్ష్మీనారాయణ, తిరుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న మాల ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు అలుక కిషన్

కామారెడ్డి, నవంబర్ 20 : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించే మాల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్ అతిథి గృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలు, మాల ఉపకులాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కో చైర్మన్ వెంకటేశం, నాగరాజు, అమృత్, సుధాకర్, రాజులు, సత్యం, భూపతి, కృష్ణ, రవి, నవీన్, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

నస్రుల్లాబాద్, నవంబర్ 20 : బీర్కూర్‌లో గైని మాధవ్వ(65) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం నాగేంద్రపురం దేవునిగుట్ట తండా గ్రామానికి చెందిన మాధవ్వ పొలం కోసిన తర్వాత రాలిన వడ్లను ఏరుకోవడానికి ఈ నెల 18 తేదీన ఇంటి నుంచి బయటికి వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో మంగళవారం వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం బరంగేడ్గి శివారులోని పిల్ల కాలువలో ఓ గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా భర్త మృతదేహాన్ని చూసి తన భార్యేనని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కంచర్లలో మరో మహిళ..

భిక్కనూరు, నవంబర్ 20 : భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో మహిళ దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చీకోట సుగుణ బుధవారం తన వ్యవసాయ బావి వద్ద పనులు చేస్తుండగా .. గుర్తు తెలియని వ్యక్తులు ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసుకొని హత్య చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిజామాబాద్‌కు వెళ్లిన నాయకులు

మాచారెడ్డి, నవంబర్ 20 : నిజామాబాద్‌లో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ మాదిగతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. తరలివెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్రాములు, నాగరాజు, రాజనర్సు, లావణ్య ఉన్నారు.

ప్రభుత్వ దవాఖాన తనిఖీ

రోగులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, నవంబర్ 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రోగులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన

మాట్లాడుతున్న జోనల్ అధికారిణి రజిత

బాన్సువాడ రూరల్, నవంబర్ 20 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నివారణపై గ్రామస్తులకు బుధవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్ వైజర్ రజిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వివరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధులు సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో ఏఆర్‌టీ సెంటర్‌లో వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంఈవో నాగేశ్వర్ రావు, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

కామారెడ్డి, నవంబర్ 20 : జిల్లా కేంద్రంలోని చలిమెల లక్ష్మి అశోక్‌కుమార్ కూతురు నవ్య వివాహానికి గురు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అధినేత గురువేందర్‌రెడ్డి బుధవారం పుస్తె, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ సబ్బం కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి వేడుకల్లో మాజీ జడ్పీ చైర్మన్

నిజాంసాగర్, నవంబర్ 20 : బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం నిజాంసాగర్ మండల కేంద్రానికి చెందిన గూడ సాయవ్వ, రాములు దంపతుల ఏకైక కుమార్తె సంకీర్తన, విజయభాస్కర్‌రావుల పెండ్లి వేడుకలకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాఫేదర్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేడుకల్లో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎం. మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వాజీద్ అలీ, విండో అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కే నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

లింగంపేట, నవంబర్ 20 : మండలంలోని బాణాపూర్ తండాలోని డీఎన్‌టీ తండా పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన సీఆర్పీ సంజీవ్‌ను బుధవారం సన్మానించారు. నల్లమడుగు క్లస్టర్ సీఆర్‌పీగా 10 ఏండ్లకుపైగా పని చేసిన ఆయన గత నెలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా సంజీవ్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

'శారీరక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 20: చిన్నారులకు వచ్చిన శారీరక సమస్యల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఫిజియోథెరపీ వైద్యుడు అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు.ఆయా గ్రామాల నుంచి వచ్చిన 8మంది దివ్యాంగ చిన్నారులకు ఆయన ఫిజియోథెరపీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ వెంకటేశం ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రారంభమైన స్వామి వారి జన్మదిన వేడుకలు

కాలభైరవ స్వామి ఆలయంలో సంతతధారాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

రామారెడ్డి, నవంబర్ 20 : ఇసన్నపల్లి-రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్కిగాణం, కంకణ ధారణ, సంతతధారాభిషేకంతో వేడుకలు ప్రారంభమైనట్లు ఆలయ ఈవో ప్రభురాంచంద్రం తెలిపారు. ఈ సంతతధారాభిషేకం నిర్వాహకులైన మునిగాల భారతమ్మ-వెంకయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి 3 రోజులపాటు నిరంతరం జలాభిషేకం కొనసాగుతుంది. కార్యక్రమంలో ఆలయ పూజరులు రాచర్ల శ్రీనివాస్ శర్మ, మనీశ్ శర్మ, వంశీశర్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్ముకున్న లారీ డ్రైవర్.. పట్టుకున్న స్థానికులు

లారీ డ్రైవర్

లింగంపేట, నవంబర్ 20: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీలో తరలిస్తున్న ధాన్యం నుంచి ఒక బస్తాను డ్రైవర్ వ్యాపారికి విక్రయించగా స్థానికులు పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భవానీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 647 బస్తాల ధాన్యాన్ని కేఏ27ఏ0649 నంబర్ ఉన్న లారీలో లోడ్ చేసి ట్రక్‌షీట్ నంబర్ 8322 ద్వారా గాంధారిలోని వాసవి రైస్‌మిల్‌కు తరలిస్తున్నారు. సదరు లారీడ్రైవర్ మండల కేంద్రంలోని ప్రైవేటు వ్యాపారి తాటి పాముల విజయ్‌కుమార్‌కు 42 కిలోల బస్తాను రూ. ఆరు వందలకు విక్రయించాడు. ప్రైవేటు వ్యాపారి కొనుగోలు కేంద్రం నుంచి తరలిస్తున్న ధాన్యం తీసుకోవద్దని తెలిసినా ధాన్యం బస్తా తీసుకుని డ్రైవర్‌కు డబ్బు చెల్లించాడు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు లారీ డ్రైవర్‌తో పాటు వ్యాపారిని మందలించారు. ఈ విషయమై నాయకులు సహకార సంఘ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్యను ప్రశ్నించారు. తాము అందుబాటులో లేమని, సిబ్బందిని పంపగా అక్కడ లారీ లేదని సమాధానం దాట వేశారు. ఈ విషమయంపై కలెక్టర్ విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భవానీపేట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లింగంపేట, నవంబర్ 20: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు 11మందికి రూ. 2.31లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు పూల్‌సింగ్, గోపాల్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నగేశ్, లింగంపేట పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో..

రామారెడ్డి, నవంబర్ 20 : సీఎంఆర్ చెక్కులను మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్ష్మాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగుళ్ల ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన బాధితులకు ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తూర్పు రాజు, మండల మైనారిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్, గ్రామాధ్యక్షుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మద్నూర్‌లో కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

మద్నూర్, నవంబర్ 20 : బాలలు తమ హక్కులను తెలుసుకోవాలని, విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ గంగాకిశోర్ అన్నారు. మండలకేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలలు విచ్చుకునే పువ్వులాంటివారని, ఏమీ ఆశించకుండా తీయని ఫలాలను అందించే వృక్షాల్లాంటివారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాలల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడతామని, మొబైల్‌కు దూరంగా ఉంటామని, మంచి అలవాట్లను అలవర్చుకుంటామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో వక్తలు వెంకట్, సుమన్, గణేశ్, ఉపాధ్యాయులు రాము, వేణుగోపాల్, సంతోష్, సమీనా తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు

లింగంపేట, నవంబర్20: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోనాల్, మోతె గ్రామాల్లో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాధన స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు చిక్కుమురళి మోహన్, కో-ఆర్డినేటర్ గిరిజ, సీఎస్ఎంలు సంధ్యరాణి, జ్యోతి, వినేందర్, మమతతో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 20: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉత్తమ సమాజ నిర్మాణం యువతతోనే సాధ్యమవుతుందని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ డే కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈనాటి పిల్లలే రేపటి భవిష్యత్తును తీర్చిదిద్దే పౌరులని అన్నారు. కళాశాల ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ.. వ్యక్తి నిర్మాణంతోనే దేశ నిర్మాణం జరుగుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ పిల్లల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ బాలుర విభాగం అధికారి కృష్ణ ప్రసాద్ విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

మాజీ ఎమ్మెల్యే గంగారాం వివరాలను సర్వే ఫాంలో నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

లింగంపేట, నవంబర్ 20: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నదని ఇన్‌చార్జి ఎంపీడీవో మలహరి తెలిపారు. బాయంపల్లి, కోర్పోల్, మెంగారం, మోతె, ముస్తాపూర్, లింగంపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి యజమానులు అందుబాటులో లేకుంటే మరోసారి వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్‌లో..

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 20 : మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతున్నది. మండల కేంద్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే గంగారాం వివరాలను సర్వే ఫాంలో అధికారులు నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

సర్వే 94 శాతం పూర్తి..

నాగిరెడ్డిపేట, నవంబర్ 20: మండలంలో చేపడుతున్న సమగ్ర కుల గణన సర్వే 94 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రం గోపాల్‌పేట గ్రామంలో చేపడ్తున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు.

గోడప్రతుల ఆవిష్కరణ

సమరభేరి గోడప్రతులను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 20: బీసీ సమరభేరి గోడప్రతులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం ఆవిష్కరించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీల సమరభేరి కార్యక్రమం ఉందని, బీసీలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ సంఘం జిల్లా నాయకుడు, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, తిరుపతి, పోచయ్య, మర్రి బాలయ్య తదితరులున్నారు.

ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేయాలి

ముస్తాపూర్ కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మార్కెటింగ్ డీపీఎం రమేశ్‌బాబు

లింగంపేట, నవంబర్ 20: కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని సెర్ప్ మార్కెటింగ్ డీపీఎం రమేశ్‌బాబు సూచించారు. మండలంలోని ముస్తాపూర్, కన్నాపూర్, భవానీపేట, మాలోత్ సంగ్యానాయక్ తండా, పోల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ నిర్వహించి డబ్బులు త్వరగా వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట సెర్ప్ ఏపీఎం చామంతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ర